ప్రజాస్వరం

PRAJASWARAM తెలుగు దినపత్రిక

Bullet Edition

బుధవారం 26మార్చి 2025 www.prajaaswaramdaily.com 2 pm


## కూనంనేని వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబు స్పందన ఇదే





తాడేపల్లి: "ఏ ఇజం లేదని నేను అంటే కమ్యూనిస్టులు నాపై విరుచుకుపడ్డారు. ఇప్పుడు ఖర్చు లేని ఇజం టూరిజమేనని స్టేట్‌మెంట్ ఇచ్చారు. నా మాటలు, ఆలోచలను అర్థం చేసుకోవడానికి 30 ఏళ్లు పట్టింది" అని నవ్వుతూ ఆంధ్ర సీఎం చంద్రబాబు అన్నారు. అయితే.. ఇప్పుడంత సమయం లేదని, త్వరగా ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రజల జీవితాల్లో మార్పులు తేవాలని సీఎం పేర్కొన్నారు.

తెలంగాణ అసెంబ్లీలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలను కలెక్టర్ల సదస్సులో ఏపీ సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. "గతంలో చంద్రబాబు ఉమ్మడి ఏపీ సీఎంగా ఉన్నప్పుడు.. ఏ ఇజం లేదు, ఇక టూరిజమే ప్రధానం అనేవారు.. ఏ ఇజం లేదంటే అప్పుడు మాకు కోపం వచ్చేది.. కానీ, నిజంగా ఖర్చులేని ఇజం ఏదైనా ఉందంటే అది టూరిజమే" అని కూనంనేని అన్నారు. చంద్రబాబు నాడు చెప్పిన మాటే నిజమంటూ ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలపై సీఎం స్పందించారు. "రాయలసీమ నుంచి ఉత్తరాంధ్ర వరకు టూరిజం అభివృద్ధికి అనేక అవకాశాలున్నాయి. కలెక్టర్లు జిల్లాల వారీగా టూరిజం అభివృద్ధి ప్రాజెక్టులపై శ్రద్ధ పెట్టాలి. తద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగి ప్రభుత్వ ఆదాయం కూడా పెరుగుతుంది. ఎక్కువ ఖర్చు లేకుండా ఉపాధి కల్పించే రంగం టూరిజమే" అని చంద్రబాబు పేర్కొన్నారు.



# సభలో దుమారం

పనులకు 30 శాతం కమీషన్ తీసుకుంటున్నారని కేటీఆర్ వ్యాఖ్యలు

బీఆర్ఎస్ వాళ్లు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి

భట్టి విక్రమార్క

కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన

వేడెక్కిన సభ

కమీషన్ వ్యాఖ్యలు రికార్డుల నుంచి తొలగించిన సభాపతి

హైదరాబాద్: తెలంగాణ శాసనసభ లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన వ్యాఖ్యలతో దుమారం రేపాయి. కాంగ్రెస్ నేతలు ... పనులు కావాలంటే 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారనే ప్రచారం జరుగుతోందని వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా అధికార పార్టీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సభ్యులు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని భట్టి విక్రమార్క హెచ్చరించారు. దీనిపై బీఆర్ఎస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు. ఇటు కాంగ్రెస్, అటు భారాస సభ్యుల ఆందోళనతో సభలో వాతావరణం వేడెక్కింది.

### కేటీఆర్ వ్యాఖ్యలను నిరూపించాలి భట్టి

కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను నిరూపించాలని భట్టి విక్రమార్క సవాల్ విసిరారు. లేదంటే సభలో క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సభ్యులు సభను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైకు ఉందని ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. కేటీఆర్ గౌరవంగా మాట్లాడతారని ఊహించానని.. సభనే కాదు.. రాష్ట్రాన్నే ఆయన తప్పుదోవ పట్టిస్తున్నారని భట్టి విక్రమార్క మండిపడ్డారు. మరోవైపు కేటీఆర్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు సభాపతి తెలిపారు. ఆ తర్వాత బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఎమ్మెల్యేల ప్రవేశ ద్వారం వద్ద వారు నిరసనకు దిగారు. 20, 30 శాతం ప్రభుత్వమంటూ నినాదాలు చేశారు.



## మండలిలో పంచాయతీరాజ్ సవరణ బిల్లుకు ఆమోదం

అన్ని సమస్యలకు త్వరలోనే పరిష్కారం : మంత్రి సీతక్క

ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తే యాలని అడుగుతున్నారు..

కేబినెట్, ముఖ్యమంత్రితో చర్చిస్తాం.. : మంత్రి



హైదరాబాద్ : శాసన మండలిలో పంచాయతీరాజ్ సవరణ బిల్లుకు ఆమోదం లభించింది. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ సవరణ-2025 బిల్లుపై చర్చ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి సీతక్క సమాధానం ఇచ్చారు. ఈ బిల్లుపై చాలా మంది సభ్యులు విలువైన సూచనలు చేశారు.. ఈ బిల్లులో లేని అంశాలను సభ్యులు ప్రస్తావించారు.. సభ్యులు ప్రతిపాదనలు పంపితే పరిశీలిస్తాం.. రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు ఆదిలాబాద్ నుంచి అచ్చంపేట వరకు షెడ్యూల్ ఏరియాలో గుర్తించారు.. ఏమైనా సమస్యలు ఉంటే పరష్కరిస్తాం.. మాకు మున్సిపాలిటీ కావాలని ఎన్నో గ్రామ ప్రజలు అడుగుతున్నారు.. మున్సిపాలిటీలు అయితే డెవలప్ అయితామని అనుకుంటున్నారు. ములుగు జిల్లా కేంద్రమైనా మునిసిపాలిటీ చేయలేదు.. కానీ, ఇప్పుడు మనం ములుగును మున్సిపాలిటీగా చేసుకుంటున్నాం.. ప్రజల అభిప్రాయం, కలెక్టర్లు పంపిన ప్రతిపాదనలు ఆధారంగా మున్సిపాలిటీలుగా అప్డేట్ చేస్తున్నాం.. చాలా మండలాల్లోని గ్రామాలను ఇతర జిల్లాల్లో కలిపారు.. స్థానిక ఎన్నికల సందర్భంగా ఎన్నో గందరగోళాలు తలెత్తుతున్నాయని మంత్రి సీతక్క చెప్పుకొచ్చింది.

ఇక, కొన్ని గ్రామాలు ఒక మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంటున్నాయి.. రెవిన్యూ పరిధి వేరే మండలంలో ఉంటుంది అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.. ఆ సమస్యలకు పరిష్కారం చూపుతాం.. ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తే యాలని అడుగుతున్నారు.. కేబినెట్, ముఖ్యమంత్రితో చర్చిస్తాం.. కొత్త గ్రామ పంచాయతీలలో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను పరిశీలిస్తాం.. గ్రామాల్లో సమస్యలు ఉన్నాయని కొందరు సభ్యులు ప్రస్తావించారు.. వాటిని పరిష్కరిస్తున్నాం.. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు ఆమోదించుకున్నాం.. కేంద్రం ఆ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తే రిజర్వేషన్లు పెరుగుతాయి.. అన్ని పార్టీలు కేంద్రం మీద ఒత్తిడి తేవాలి అని సీతక్క కోరారు.

# పల్లా vs భట్టి, పొంగులేటి

భూ భారతిపై చర్చ







### 'ధరణి'ని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పాం.. : భట్టి విక్రమార్క

హైదరాబాద్: అసెంబ్లీ లో 'భూ భారతి'పై వాడీవేడి చర్చ జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క కలం పోటుతో భూమిపై హక్కులు లేకుండా చేసిన దుర్మార్గమైన చట్టం ధరణి అని భట్టి విక్రమార్క అన్నారు. ఆ చట్టాన్ని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పామని.. అలానే చేశామని చెప్పారు.

భూభారతి భూహారతి : ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది భూ భారతి కాదని.. భూ హారతి అని పల్లా ఆరోపించారు. జమాబందీ పేరుతో ప్రభుత్వం మరో దుకాణం తెరిచిందని విమర్శించారు. ఇప్పుడు జమాబందీ ఎందుకో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు.

### పల్లావి సత్యదూరమైన ఆరోపణలు : భట్టి

: పల్లా రాజేశ్వర్‌రెడ్డి సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నారని భట్టి విక్రమార్క అన్నారు. "దున్నేవాడిదే భూమి అనేది సాయుధ పోరాట నినాదం. ఆ పోరాట స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వం భూములపై హక్కులు కల్పిస్తూ వస్తోంది. ఒక్క కలం పోటుతో భూమిపై హక్కులు లేకుండా చేసిన దుర్మార్గమైన చట్టం ధరణి. ఆ చట్టాన్ని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పాం.. వేశాం. 'భూ భారతి' పేరిట కొత్త చట్టం తీసుకొచ్చాం. అనేక చట్టాలు, పోరాటాల ద్వారా వచ్చిన హక్కులను గతంలో కాలరాశారు. ధరణిని బంగాళాఖాతంలో వేయాలనే ప్రజలకు మాకు అధికారం కట్టబెట్టారు" అని భట్టి విక్రమార్క అన్నారు.

### భవిష్యత్తులో 'భూభారతి'పైనే ఎన్నికలకు..: పొంగులేటి

భవిష్యత్తులో భూభారతిపైనే ఎన్నికలకు వెళ్తామని చెప్పారు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి . అసత్యాన్ని సత్యం చేసేందుకు పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. "బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే ఆ పార్టీని ఓడించారు. వీఆర్ఏ, వీఆర్వోలపై గత ప్రభుత్వం ఏవిధంగా ప్రేమ చూపించిందో అందరికీ తెలుసు. వాళ్లకు ప్రత్యేకమైన గౌరవం ఇస్తాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం" అని పొంగులేటి చెప్పారు.